సాక్షి
వికారాబాద్

బుధవారం । 14 । మే । 2025



చెరువెండుతోంది!

యాచారం మండల పరిధిలోని మెజార్టీ చెరువులు, కుంటలు ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. 8లో▶



సమస్యలు పరిష్కరించండి

కార్మిక సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. 8లో▶



గ్రామ పంచాయతీలకు..

గ్రామ పంచాయతీల్లో పాలన గాడి తప్పుతోంది. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అభివృద్ధి ఆగింది. 9లో▶

ప్రైవేటుకే మొగ్గు!



దౌల్తాబాద్‌లో రైతులు ఆరబోసిన ధాన్యం

- ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలపై ఆసక్తి చూపని రైతులు
- సకాలంలో డబ్బు జమకాకపోవడం, కొర్రీలే కారణం
- 25 రోజులు కావస్తున్నా వచ్చింది పది శాతం వడ్లే
- పొంచివున్న వరుణ గండం
- రోడ్లపై ఆరబోసిన ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు

జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 93వేల ఎకరాలు
దిగుబడి అంచనా 2.25లక్షల మెట్రిక్ టన్నులు
ఇప్పటి వరకు సేకరించింది 17వేల మెట్రిక్ టన్నులే
రైతులకు చెల్లించాల్సిన మొత్తం రూ.40 కోట్లు
జమ చేసింది రూ.18 కోట్లే

వికారాబాద్: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం విక్రయించడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. కేంద్రాలు ప్రారంభించి దాదాపు నెల రోజులు కావస్తున్నా పంట దిగుబడిలో కేవలం పది శాతం మాత్రమే విక్రయించారు. సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం, కొర్రీల కారణంగా బహిరంగ మార్కెట్, కళ్లాల వద్ద దళారులకు విక్రయిస్తున్నారు. మరో వైపు వరుణ గండం పొంచి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమై కళ్లాల్లోకి ధాన్యం నిల్వలు చేరాయి. వడ్లు ఆరబెట్టి విక్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలు భయపెడుతున్నాయి. 15 రోజులుగా అడపదడపా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జిల్లాలో వరి దిగుబడిని అంచనా వేసిన అధికారులు 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 85 సెంటర్లను ప్రారంభించారు. తాలు, తేమ శాతం పేరిట కేంద్రాలకు వచ్చిన వడ్లను నిర్వాహకులు తిప్పి పంపుతుండటం రైతులకు ఇబ్బందిగా మారింది.

లక్ష్యం.. లక్ష మెట్రిక్ టన్నులు

జిల్లాలో 93 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. 2.25 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందులో లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాలకు రావచ్చని భావిస్తున్నారు. అయితే కొనుగోలు ప్రక్రియ ప్రారంభించి 25రోజులు కావస్తున్నా కేవలం 17 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. ఇందులో 424 మెట్రిక్ టన్నుల సన్నరకం వడ్లు కాగా, 13.44 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి రూ.40 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.18 కోట్లు అన్నదాతల ఖాతాల్లో జమ చేశారు. ఇంకా రూ. 22 కోట్లు చెల్లించాల్సి ఉంది.

భయపెడుతున్న వరుణుడు

పది రోజుల నుంచి అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చాలా గ్రామాల్లో రైతులు కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని కళ్లాలు, రోడ్లపై ఆరబోశారు. ఈ సమయంలో వర్షాలు పడితే వడ్లు తడిసి గిట్టుబాటు ధర రాదని భయాందోళన చెందుతున్నారు. చాలా మంది రైతుల వద్ద టార్పాలిన్లు లేవు. ఇదిలా ఉండగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు స్థలాలు లేక అధికారులు ఇబ్బంది పడుతున్నారు. సేకరించిన వడ్లను రైస్ మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతోంది.

కేంద్రాల కుదింపు

రెండేళ్ల క్రితం 60 వేల ఎకరాల్లో వరి పంట సాగు కాగా 167 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగినా (92 వేల ఎకరాల్లో) 128 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం 85 సెంటర్ల ద్వారానే ధాన్యం సేకరిస్తున్నారు. ఈ నెల చివరి నాటికి పూర్తి స్థాయిలో వడ్లు కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. లక్ష మెట్రిక్ టన్నులు రావచ్చని చెబుతున్నారు. అయితే కొనుగోలు కేంద్రాల వద్దే ధాన్యం ఆరబోసుకునేందుకు సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పక్కాగా ఏర్పాట్లు

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలుకు పక్కా ఏర్పాట్లు చేశాం. తాలు, తరుగు, తేమ శాతం, మట్టి పెల్లలు ఎంత మేర ఉంటే కొనుగోలు చేయాలనే దానిపై కేంద్రాల నిర్వాహకులకు అవగాహన కల్పించాం. ప్రస్తుతం వర్షాలు పడుతుండటం కొంత మేర ఇబ్బంది కలిగిస్తోంది. అయినా రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం. ధాన్యం మిల్లులకు చేరగానే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నాం. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలి. దళారులను నమ్మి మోసపోరాదు.

– లింగ్యానాయక్, అడిషనల్ కలెక్టర్



మోమిన్‌పేటలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న స్పీకర్ తదితరులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- బిక్కరెడ్డి గూడెంలో బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన
- పలు గ్రామాల్లో సీసీ రోడ్లు ప్రారంభం

మోమిన్‌పేట: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో రూ.8.15 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. బిక్కరెడ్డి గూడెంలో రూ.3 కోట్లతో బీటీ రోడ్డు పనులకు, మల్లారెడ్డిగూడెం చెరువు, ఎన్కతల పెద్ద చెరువు మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు. మోమిన్‌పేటలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే అర్హులైన పేదలందరికీ మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు దశల వారీగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదట సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు మంజూరు చేశామన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఎన్నో ఏళ్లుగా బిక్కరెడ్డిగూడెంకు రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుతం రూ.3 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి, పీఆర్ ఏఈఈ ప్రణీత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు నరోత్తంరెడ్డి, సురేందర్, శుభాష్‌గౌడ్, సిరాజొద్దీన్, మహంత్‌స్వామి, ఎజాస్, ఎరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

అనంతగిరి: ప్రపంచ సుందరి అందాల పోటీలను రద్దు చేయాలని అడిగినందుకు మహిళా సంఘాల నాయకులను హౌస్ అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి గీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ అందాల పోటీలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు విరుద్ధమని, ఈ పోటీలను నిర్వహించరాదని కోరారు. ప్రభుత్వం నడిపేందుకు ఇబ్బందిగా ఉన్న ఈ తరుణంలో రూ.300 కోట్లు ఖర్చు చేయడం సరైంది కాదని హితవు పలికారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తుంటే పీఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్య, ఐద్వా నాయకురాలు మల్లు లక్ష్మి, ఇతర జిల్లాల నాయకులను అక్రమ అరెస్టులు చేశారని తెలిపారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

అనంతగిరి: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ సంస్థ ఆధ్వర్యంలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను తల్లిదండ్రులు కోల్పోయిన బాలికల నుంచి, అక్రమ రవాణాకు గురైన, దివ్యాంగ బాలికల నుంచి మూడు సంవత్సరాల టెక్నికల్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మహిళా సంక్షేమ శాఖ అధికారి జయసుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ తదితర కోర్సుల్లో సీట్లు ఉన్నాయని తెలిపారు. అమ్మాయిలు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరీక్ష రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలన్నారు. దరఖాస్తుకు కులం, ఆదాయం (అనాథబాలికలకు అవసరం లేదు), తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్ సర్టిఫికెట్లను జతచేసి ఈ నెల 20వ తేదీలోపు వికారాబాద్‌లోని బాలరక్ష భవన్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ల 9640863896, 9849672296లో సంప్రదించాలన్నారు.

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

అనంతగిరి: పాలిసెట్ ప్రవేశ పరీక్ష మంగళవారం ప్రశాంతంగా జరిగింది. వికారాబాద్‌లోని ఎస్‌ఏపీ కళాశాల, ఏసీఆర్ భృంగీ పాఠశాలలో సెంటర్లు ఏర్పాటు చేశారు. గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. మొత్తం 1,400 మందికి గాను 1,282 మంది విద్యార్థులు హాజరైనట్లు పాలీసెట్ జిల్లా కన్వీనర్ రవీందర్ తెలిపారు.

ఆటోనగర్ ఏర్పాటు చేయాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూరు: పట్టణ శివారులో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని తాండూరు మెకానిక్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కోరారు. కోకాపేట్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లారీ మెకానిక్ అసోసియేషన్, స్టోన్, క్వారీ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించారు. పట్టణంలో ఆటోనగర్ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే తాండూరు – హైదరాబాద్ మార్గంలో అధునాతన వసతులతో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రవూఫ్, పట్లోళ్ల నర్సింహులు, జుబేర్‌లాల, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడితో ఆదర్శంగా నిలవాలి

రంగారెడ్డి వ్యవసాయాధికారి నర్సింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు

యాచారం: కూరగాయలు, ఆకుకూరల దిగుబడి సాధించి ఆదర్శంగా నిలవాలని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో మంగళవారం రైతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పైలెట్ పథకాన్ని సద్వినియోగం చేసుకుని రైతులు రాయితీపై అందజేసే వ్యవసాయ యంత్ర పరికరాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లను పొందాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు నమోదు ప్రక్రియను తెలియజేశారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి సురేష్‌కుమార్ వ్యవసాయ, పండ్లతోటల పెంపకం గురించి వివరించారు. డ్రిప్ పద్ధతి ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడి పొందొచ్చని తెలిపారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి నవీన తదితరులు పాల్గొన్నారు.



రాంరెడ్డిపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కాలుష్య రహిత గ్రామాలే లక్ష్యం

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్, రాంరెడ్డిపల్లి, ముజాహిద్‌పూర్, పటేల్‌చెరువు తండా, కామునిపల్లి, కుల్కచర్ల గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో అన్ని సదుపాయాలు, మౌలిక వసతులు ఉండేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, మొక్కల పెంపకం చేపట్టి కాలుష్య రహితంగా గ్రామాలను తీర్చిదిద్దుతామని అన్నారు. కాంగ్రెస్ అంటేనే పేదల ప్రభుత్వమని అన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని పథకాలు అమలు చేస్తామని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు చంద్రభూపాల్, రవి, భరత్‌కుమార్ రెడ్డి, సోమలింగం, షర్ఫొద్దీన్, భాస్కర్, కృష్ణయ్య పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు

దోమ: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శివారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇళ్లు రాని వారు ఆందోళన చెందరాదని, రెండో విడతలో న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, డైరెక్టర్ శాంతుకుమార్, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఈడిగి రమేశ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, మాజీ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, మొగులయ్యగౌడ్, భీంరెడ్డి, ఆంజనేయులు, రామకృష్ణారెడ్డి, నర్సింహులు, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు సహకరించాలి



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

- గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తాం
- తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్‌లో వెలసిన రేణుకా ఎల్లమ్మ తల్లి జాతరకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎవరైనా గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ బాలకృష్ణారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. నెల రోజుల పాటు జరిగే జాతరకు తెలంగాణ, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారని తెలిపారు. సీసీ కెమెరాల నీడలో జాతర జరుగుతుందని పేర్కొన్నారు. ఈ నెల 30న రథోత్సవం ఉంటుందని అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. జాతరలో గొడవలు జరగకుండా బందోబస్తు నిర్వహించాలని ఎస్‌ఐ విఠల్‌రెడ్డిని ఆదేశించారు.

వీర జవాన్లకు ఘన నివాళి

- సంఘీభావ యాత్రకు భారీగా తరలివచ్చిన జనం
- ఆలంపల్లి నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు సాగిన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, విద్యార్థులు, పలు సంఘాల నాయకులు

అనంతగిరి: భారత్ – పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన మన సైనికుల కోసం మంగళవారం వికారాబాద్ పట్టణంలో అశ్రునివాళి పేరిట సంఘీభావ యాత్ర నిర్వహించారు. ఆలంపల్లి నుంచి ప్రధాన రోడ్ల మీదుగా ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ సాగింది. రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులు, వ్యాపారులు, మాజీ సైనికులు, కుల సంఘాల నాయకులు, ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ సభ్యులు, వైద్యులు, వైద్య కళాశాల విద్యార్థులు, యువకులు యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీర జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు. సైన్యానికి మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీర జవాన్ల కుటుంబాలకు, దేశానికి అండగా ఉంటామన్నారు. ఎండను సైతం లెక్కచేయకుండా చిన్నారులు, పెద్దలు ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్‌టీఆర్ చౌరస్తా వద్ద రెండు నిమిషాల పాటు మౌనం పాటించి పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు సత్తయ్య, లింగమయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, బీజేపీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్. సాధు సత్యనాథన్, ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, ఆయా పార్టీల నాయకులు వడ్లనందు, అశోక్, అమరేందర్‌రెడ్డి, దేవదాసు, శివరాజు, సుభాష్, సుభాన్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, పాండుగౌడ్, శ్రీధర్‌రెడ్డి, రమేష్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

దేశం నుంచి బహిష్కరించాలి



పరిగి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పరిగి: పాకిస్తానీయులను దేశం నుంచి బహిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పరిగి పోలీస్ స్టేషన్, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పరిగి పట్టణంతోపాటు పరిసర ప్రాంతాల్లో పాకిస్తానీయులు ఉన్నట్టు తమకు సమాచారం వచ్చిందన్నారు. వారిని వెంటనే దేశం నుంచి బహిష్కరించాలని కోరారు. అలాగే దేశ సంపద తింటూ వ్యాపార సంస్థలకు శత్రు దేశం పేర్లు పెట్టుకోవడం దారుణమన్నారు. అలాంటి పేర్లను వెంటనే తొలగించి ఆ సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాంచందర్, కార్యదర్శి పెంటయ్య గుప్తా, పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే కొత్త చట్టం

ఆర్డీఓ వాసుచంద్ర



భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ వాసుచంద్ర

ధారూరు: భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అందుబాటులోకి తెచ్చిందని ఆర్డీఓ వాసుచంద్ర తెలిపారు. మంగళవారం మండలంలోని దోర్నాల్, గురుదోట్ల, కుమ్మర్‌పల్లి గ్రామాల్లో కొత్త చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో భూ సమస్యల పరిష్కారానికి ఆర్‌డీఓ, కలెక్టర్, కోర్టుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, కొత్త చట్టం ద్వారా గ్రామంలోనే సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతుల నుంచి 35 దరఖాస్తులు స్వీకరించారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాస్, సాజిదాబేగం, దీపక్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే సేకరించి రైస్ మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. మండలంలోని గట్టేపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటి ద్వారా 17,459.920 మెట్రిక్ టన్నులు వడ్లు సేకరించినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.18 కోట్లు జమ చేసినట్లు వివరించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని, దళారులను నమ్మి మోసపోరాదని రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీటీసీఎస్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని దోర్నాల్ గ్రామంలో నిర్వహించిన భూభారతి సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

కూలీల సమస్యలు పరిష్కరించాలి

బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

చేవెళ్ల: ఉపాధి హామీ పథకంలో పనిచేసే పేద కూలీలకు వెంటనే బిల్లులు విడుదల చేయాలని, పనిచేసే చోట మౌలిక వసతులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవిలో ఉపాధి పనులు చేసే కూలీలకు పని చేసే చోట కనీస వసతులు కల్పించాలన్న నిబంధనలను తప్పనిసరి పాటించాలన్నారు. కనీస వేతనం రావడం లేదని, ఐదు వారాల నుంచి ఉపాధి కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

సత్యసాయి సేవాకేంద్రంలో ఉచిత 'స్పోకెన్ ఇంగ్లిష్'

కేంద్రం వ్యవస్థాపకుడు వెంకట్‌రెడ్డి



సత్యసాయి సేవా కేంద్రంలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు ప్రారంభిస్తున్న వెంకట్‌రెడ్డి

పరిగి: శ్రీసత్యసాయి సేవాకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రంగాపూర్ శ్రీసత్యసాయి సేవాకేంద్రం వ్యవస్థాపకుడు సోలిపేట వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువత కోసం మంగళవారం ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆంగ్ల భాష తప్పనిసరిగా మారిందన్నారు. గ్రామీణ విద్యార్థులు ఆంగ్లంలో వెనుకబడి ఉన్నారన్నారు. వారికి ఆంగ్ల భాషపై పట్టు పెంచేందుకే తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాండూరు టౌన్: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన తాండూరు, రుక్మాపూర్ రైల్వే స్టేషన్ల మధ్య చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి ముంబాయి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం వచ్చిందన్నారు. సదరు వ్యక్తి వయసు 50 ఏళ్లకు పైబడి ఉంటుందని, ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నామన్నారు. ఈ మేరకు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసుకున్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృత దేహాన్ని గుర్తు పట్టిన వారు 87125 13854 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

ఇసుక టిప్పర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్

యాలాల: ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఓ టిప్పర్‌ను యాలాల పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి విధుల్లో భాగంగా కానిస్టేబుళ్లు జగదీష్, నరేష్ గస్తీ నిర్వహి స్తున్నారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి బాగాయిపల్లి శివారులో గల పౌల్ట్రీ ఫారం సమీపంలో ఇసుక లోడ్‌తో ఓ టిప్పర్ వెళుతుండగా గమనించి పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో పీఎస్‌కు తరలించారు. కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నన్ను క్షమించు అన్నయ్య

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం



గోవర్ధన్‌రెడ్డి (ఫైల్)

బంట్వారం: కుటుంబ కలహాలతో వేర్వేరుగా తన అన్నావదినలు ఉండడంతో అవమానంగా భావించిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ సంఘటన మంగళవారం బంట్వారం మండలంలోని తొర్మామిడిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం యాదవ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొర్మామిడికి చెందిన పోచారం గోవర్ధన్‌రెడ్డి (32)కు వివాహం కాలేదు. వ్యవసాయం చేస్తూ తల్లితో కలిసి ఉండేవాడు. తన అన్న నర్సింహారెడ్డి నగరంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కుటుంబ కలహాలతో నర్సింహారెడ్డి, భార్య నవనీత దూరంగా ఉంటున్నారు. వీరికి ఇద్దరు సంతానం కూడా ఉన్నారు. 'వదిన తీరుతో కుటుంబం పరువు పోతోంది.. నన్ను క్షమించు అన్నయ్య' అంటూ సూసైడ్ నోట్ రాసి పొలం దగ్గర చెట్టుకు ఉరి వేసుకుని గోవర్ధన్‌రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం జరిపించినట్లు ఎస్ఐ చెప్పారు.

చెరువెండుతోంది!



- ఎడారిని తలపిస్తున్న చెరువులు, కుంటలు
- నీళ్లు లేక ఏపుగా పెరిగిన కంపచెట్లు
- పాడైన తూములు, కాల్వలు
- మర్మతులు చేయాలని రైతుల అభ్యర్థన

గుంతల్లోనే నీళ్లున్న చింతపట్ల లక్ష్మణ్ చెరువు

యాచారం: మండల పరిధిలోని మెజార్టీ చెరువులు, కుంటలు ఎండిపోయి ఎడారిని తలపిస్తున్నాయి. మూడేళ్లుగా సరైన వర్షాలు కురవకపోవడంతో గుంతల్లో చేరిన కొద్దిపాటి నీరు సైతం ఇంకిపోయింది. మొత్తం 24 గ్రామాల్లో 120 చెరువులు, కుంటలు, 50కి పైగా చెక్‌డ్యాంలు ఉన్నాయి. వీటిలో నీళ్లుంటేనే పంటల సాగుకు సమృద్ధిగా నీళ్లు అందుతాయి. సుమారు ఎనిమిది వేలకు పైగా బోరుబావుల కింద రైతులు వరితో పాటు పలు రకాల కూరగాయ పంటలు వేసి ఉపాధి పొందుతుంటారు. కానీ ప్రస్తుతం సుమారు 5 వేలకు పైగా బోర్లు అడుగంటాయి. మిగిలిన వాటిలో కొద్దిపాటి నీళ్లు వస్తున్నాయి. 40 వేల ఎకరాలకు పైగా సాగయ్యే పంటల విస్తీర్ణం 80 శాతానికి పైగా పడిపోయింది. మూగ జీవాల దాహార్తి తీర్చడం కూడా కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదే అదును

చెరువులు, కుంటల్లో నీళ్లు లేక ఎండిపోవడంతో మరమ్మతు పనులకు ఇదే మంచి సమయం. వర్షాలు కురిస్తే చెరువులు, కుంటల్లోకి నీరు చేరి పనులు సాగవు. ప్రస్తుతం వీటిలో కంపచెట్లు ఏపుగా పెరిగాయి. కాల్వలు, తూములు సైతం మరమ్మతులకు గురయ్యాయి. వీటిని బాగు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. తక్కళ్లపల్లిలోని చెన్నరెడ్డి చెరువు, నక్కర్తమేడిపల్లిలోని సాలిచెరువు, ఊర చెరువు, తాడిపర్తిలోని బంధం చెరువు, కుర్మిద్దలోని పెద్ద చెరువు, మల్కీజ్‌గూడలోని మగ్దుంఅలీ చెరువు, మొండిగౌరెల్లిలోని పకీరోని చెరువు, మత్రికుంట, నల్లవెల్లిలోని నల్లవెల్లి చెరువు ఇలా ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీళ్లు లేకపోవడంతో ఎండిపోయాయి. దీనికి తోడు ఎఫ్‌టీఎల్ హద్దులు లేకపోవడంతో పలు గ్రామాల్లోని శిఖం భూములు అక్రమణకు గురయ్యాయి.

ఎండిపోతున్న లక్ష్మణ్ చెరువు

చింతపట్లలోని లక్ష్మణ్ చెరువులో గత ఏడేళ్లుగా నీళ్లు సమృద్ధిగా ఉన్నాయి. దీంతో యాచారం, మంచాలతో పాటు నల్గొండ జిల్లా మర్రిగూడ, చింతపల్లి మండలాల్లోని అనేక గ్రామాల్లోని బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లుంటాయి. ప్రస్తుతం లక్ష్మణ్ చెరువులో సైతం గుంతల్లోనే నీళ్లున్నాయి. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే పక్షం రోజుల వ్యవధిలోనే చెరువు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంటుంది. ఇదే జరిగితే బోరుబావుల్లో నీల్లు తగ్గి కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉంది.



నక్కర్తమేడిపల్లిలోని సాలీ చెరువులో మొలుస్తున్న కంపచెట్లు

మరమ్మతులకు కృషి



చెరువులు, కుంటల్లోని కంపచెట్లను తొలగించడంతో పాటు మర్మతులకు కృషి చేస్తున్నాం. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తిస్తాం.

– అయ్యప్ప, తహసీల్దార్ యాచారం

జాతరకు వెళ్లొస్తూ.. అనంత లోకాలకు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



రాజు (ఫైల్)

కందుకూరు: పక్కన ఊరిలో జరుగుతున్న జాతరకు వెళ్లొస్తూ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కందుకూరు సీఐ జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గూడూరుకు చెందిన పోలదాస్ రాజు(40) ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన సోమవారం సాయంత్రం ఊట్లపల్లిలో జరుగుతున్న జాతరకు బైక్‌పై వెళ్లి తిరిగి రాత్రి వేళలో స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కందుకూరు సమీపంలో ఏఎస్ దాబా ఎదుట శ్రీశైలం హైవేపై వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం అతని బైక్‌తో పాటు ముందు నడుచుకుంటూ వెళ్తున్న పౌల్ట్రీ ఫారమ్‌లో పని చేసే ఒడిశాకు చెందిన మను, జగన్‌లను ఢీకొట్టుకుంటూ వెళ్లింది. దీంతో బైక్ పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. మనుకు గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెరువులో మృతదేహం లభ్యం

పహాడీషరీఫ్: చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుజూసింది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉస్మాన్‌నగర్‌లోని బుర్హాన్‌ఖాన్ చెరువులో మంగళవారం ఉదయం వ్యక్తి మృతదేహం తేలియాడుతుండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించగా, ఒంటిపై వస్త్రాలు లేకుండా ఉన్నాడు. నడుముకు మొలత్రాడు, ఎడమ కాలుకు దారం కట్టి ఉండడాన్ని బట్టి హిందువుగా పోలీసులు భావిస్తున్నారు. చెరువులో పడి 24 గంటలు కావచ్చని, మృతుడి వయసు 40–45 ఏళ్ల నడుమ ఉంటుందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కుళ్లిన స్థితిలో..

పహాడీషరీఫ్: కుళ్లిన స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఎల్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లి గ్రామ శివారు సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ప్రాంతంలోని మామిడితోట గోడను ఆనుకొని మృతదేహం పడి ఉండడాన్ని సోమవారం సాయంత్రం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లి పోలీసులు పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిన స్థితిలో కనిపించింది. 15 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని, మృతుడి వయసు 45–50 ఏళ్ల నడుమ ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఒంటిపై నలుపు రంగు టీ–షర్ట్, నీలి రంగు ప్యాంటు ధరించి ఉంది. కాగా ఇటీవల ఈ ప్రాంతంలో ఓ వ్యక్తి పిచ్చిగా ప్రవర్తిస్తూ మట్టి, గడ్డి తినడం గమనించినట్లు స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. మామిడితోట గార్డెన్ అద్దెదారుడు తుమ్మ రాజశేఖర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇతని సంబంధీకులెవరైనా ఉంటే పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62402 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యం



కవిత (ఫైల్)

మొయినాబాద్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎనికేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనికేపల్లికి చెందిన వడ్డె కవిత(23) మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పిడుగుపాటు.. ముందే తెలిసేట్టు



దామిని లైట్నింగ్ యాప్

షాబాద్: అకాల వర్షాలకు పిడుగులు పడి ప్రజలు, మూగజీవాలు మృత్యువాత పడుతున్నారు. ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు ప్రజా జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలైన ఉరుములతో కూడిన వర్షాలతో పాటు పిడుగు పాటుతో ప్రాణ, ఆస్తినష్టం జరుగుతూనే ఉంది. ఏటా పిడుగుపాటుకు గురై అధిక సంఖ్యలో మూగజీవాలు, చాలా మంది ప్రజలు ప్రాణాలు సైతం కోల్పోయిన ఘటనలు ఉన్నాయి. అయితే పిడుగు పాటుపై పరిశోధనలు చేసిన భారత వాతావరణ శాఖ ముందే పసిగట్టేందుకు ఓ యాప్‌ను ఆవిష్కరించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) 'దామిని' యాప్‌ను రూపొందించింది.

యాప్ డౌన్‌లోడ్ ఇలా

ప్రతి పౌరుడు తన స్మార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి దామిని యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. యాప్‌ను తెరిచి పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, పిన్‌కోడ్ నమోదు చేయాలి. అనంతరం జీపీఎస్ లొకేషన్ కోసం యాప్‌ను వినియోగించే సమయంలో మీ ప్రాంతంలో పిడుగుపడే అవకాశం ఉందో లేదో మూడు రంగుల్లో చూపిస్తుంది.

ఎరుపు రంగు: మీరు ఉన్న ప్రాంతంలో మరో 7 నిమిషాల వ్యవధిలో పిడుగుపడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ ఎరుపు రంగులోకి వస్తుంది.

పసుపు రంగు: మీరు ఉన్న ప్రాంతంలో 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడేలా ఉంటే ఆ సర్కిల్ పసుపు రంగుగా మారుతుంది.

నీలం రంగు: 18 నుంచి 25 నిమిషాలలోపు పిడుగు పడే అవకాశం ఉంటే ఆ సర్కిల్ నీలం రంగులో కనిపిస్తుంది.

ఇవి పాటించాలి

- నల్లటి మబ్బులు ఆకాశం అంతటా విస్తరించి భారీ వర్షం కురుస్తున్నప్పుడు రైతులు పొలాల్లో తిరగకుండా ఏవైనా భవనాల్లోకి లేక తాము ఉన్న స్థానంలోనే మోకాళ్లపై కూర్చొని రెండు చెవులను చేతులతో మూసుకోవాలి.
- బహిరంగ ప్రదేశాల్లో పిడుగుపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మొబైల్ సిగ్నల్స్ పిడుగు పడే అవకాశాన్ని ఎక్కువగా కల్పిస్తుంది. పంట పొలాల్లో వాడకూడదు.
- విద్యుత్ స్తంభాలు, సెల్‌ఫోన్ టవర్లు, బోర్‌పంప్ సెట్లకు దూరంగా ఉండాలి. బోరు మోటార్ల నుంచి వచ్చే నీటిని కూడా ఆ సమయంలో వినియోగించవద్దు.
- పశువులను మేతకు బయటకు తీసుకెళ్లకుండా పాకలోనే ఉంచాలి.
- పిడుగులు పొడవైన చెట్ల మీద పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వర్షం కురిసినప్పుడు చెట్ల కింద ఉండొద్దు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని ప్రతి పల్లె, తండాల్లోని వీధులన్నీ పరిశుభ్రంగా మారుతున్నాయని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తుంకిమెట్లలో సీఆర్ఆర్ నిధులు రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రానున్న వర్షాకాలంలో పారిశుద్ధ్యం లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, నాయకులు జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్ రాంచంద్రారెడ్డి, మల్లేశం, మల్లికార్జున్, అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన చెట్టు



మోమిన్‌పేట: మోమిన్‌పేటలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి రోడ్డుపై చెట్టు విరిగిపడింది. మోమిన్‌పేట–శంకర్‌పల్లి వెళ్లే దారిలో చిలకవాగు వద్ద వృక్షం విరిగి రోడ్డుపై పడటంతో వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు పక్క నుంచి బురదలో వాహనాలు వెళ్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు



నారాయణరెడ్డి, జిల్లా ఎస్పీ

బంట్వారం: హత్య కేసులో ముగ్గురి నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్స్ జడ్జి సున్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తీర్పు వెల్లడించారని ఎస్పీ నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం ఇందోల్ గ్రామానికి చెందిన బాసుపల్లి పెంటప్ప, హన్మంతు అన్నాదమ్ములు. వీరి దాయాదులు బాసుపల్లి అంజిలప్ప కుటుంబంతో తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2014 డిసెంబర్ 4న రాత్రి హన్మంతు తన ఇంటికి వెళ్తుండగా అంజిలప్ప ఘర్షణకు దిగాడు. అదే సమయంలో అంజిలప్ప కుమారులు శ్రీనివాస్, పాండు అక్కడికి చేరుకున్నారు. తండ్రీకొడుకులు కలిసి హన్మంతు తలపై రాయి, కర్రతో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయమై మృతుడి సోదరుడు బాసుపల్లి పెంటప్ప ముగ్గురిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ రమేశ్ పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కరణ్‌కోట్ సీఐ శివశంకర్ సమగ్రంగా దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న జిల్లా జడ్జి సున్నం శ్రీనివాస్‌రెడ్డి ముగ్గురు నిందితులకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పీపీలు నారాయణగౌడ్ రవికుమార్, సుధాకర్‌రెడ్డి, అప్పటి దర్యాప్తు అధికారులు శివశంకర్, రమేష్, ప్రస్తుత సీఐ రఘురాములు, ఎస్ఐ గఫార్, సీడీఓ మహేష్‌రెడ్డి, బ్రీఫింగ్ అధికారి వీరన్నలను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్
- సమ్మె నోటీసు అందజేత



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న మున్సిపల్ కార్మికులు

తాండూరు టౌన్: కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా ఈనెల 20న సార్వత్రిక సమ్మె చేయనున్నట్లు మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ యూనియన్ సభ్యులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డికి నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు, కార్పొరేట్ వ్యవస్థకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కుల చట్టాలను మార్చి వారికి అనుకూలమైన చట్టాలను అమలు చేస్తోందన్నారు. కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించడం, ఉద్యోగ భద్రత కల్పించడం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి హక్కులను తుంగలో తొక్కిందన్నారు. వెట్టిచాకిరీ నుంచి బయట పడేందుకు కార్మికులంతా కలిసి సార్వత్రిక సమ్మె చేయనున్నట్లు తెలిపారు. కేంద్రం వెంటనే స్పందించి కార్మిక చట్టాల ప్రకారం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

సాగులో రసాయనాలు నియంత్రించాలి

శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



బెల్కటూర్‌లో రైతులతో మాటాడుతున్న శాస్త్రవేత్తలు

తాండూరు రూరల్: పంటలపై రసాయన మందుల వాడకాన్ని నియంత్రించాలని తాండూరు వ్యవసాయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి సూచించారు. మంగళవారం మండలంలోని బెల్కటూర్ గ్రామంలోని రైతు వేదిక వద్ద రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు యూరియాను అధికారులు సూచించిన మోతాదులోనే వాడాలన్నారు. విత్తనాలు, ఎరువులు కొనేటప్పుడు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఆధునిక పద్ధతులు ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు శేఖర్, యమున పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ కొమరయ్య, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీం కేంద్రంపై దాడులు

- కాలం చెల్లిన ముడిపదార్థాలతో తయారీ
- ముగ్గురిపై కేసు నమోదు



నకిలీ ఐస్‌క్రీంలు విక్రయిస్తున్న బండి

కుల్కచర్ల: కాలం చెల్లిన పదార్థాలతో ఐస్‌క్రీంలు తయారు చేస్తున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి కేసు నమోదు చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అన్వేష్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొందుర్గు మండలం పార్వతీపురం గ్రామానికి చెందిన ఎండీ అజీం, యూపీకి చెందిన అనిల్, రాంపాల్ అనే ఇద్దరితో కలిసి కుల్కచర్ల మండల కేంద్రంలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని క్లాసిక్ అనే కంపెనీ పేరుతో ఐస్‌క్రీంలు తయారు చేసి విక్రయిస్తున్నారు. కాగా మంగళవారం టాస్క్‌ఫోర్స్ సీఐ అన్వర్ పాషా ఆధ్వర్యంలో సిబ్బంది ఆకస్మికంగా ఐస్‌క్రీం బండ్లపై దాడులు చేసి, తయారీ స్థావరాన్ని పరిశీలించారు. ఇందులో అన్నీ కాలం చెల్లిన పదార్థాలు ఉన్నట్లుగా అధికారులు గుర్తించి స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ

తీవ్ర గాయాలతో వ్యక్తి మృతి

కడ్తాల్: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అన్మాస్‌పల్లి–కడ్తాల్ రహదారిపై చోటు చేసుకుంది. సీఐ గంగాధర్ తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని గానుగుమార్లతండాకు చెందిన మునావత్ సోమ్లా నాయక్(38) సోమవారం రాత్రి తండా నుంచి ద్విచక్రవాహనంపై కడ్తాల్‌కు వస్తున్నాడు. అదే సమయంలో రామస్వామి అనే వ్యక్తి బైక్‌పై కడ్తాల్ నుంచి గానుగుమార్లతండాకు బయలుదేరాడు. మార్గమధ్యలో మల్లప్ప పౌల్ట్రీఫాం సమీపంలో సోమ్లానాయక్ బైక్‌ను రామస్వామి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇరువురికీ తీవ్ర గాయాలయ్యాయి. సోమ్లానాయక్‌కు తీవ్ర గాయాలవ్వడంతో 108 వాహనంలో మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుడి సోదరుడు పాండు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. రామస్వామికి కూడా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు.

దప్పిక తీరుస్తున్న దాతృత్వం

- షాద్‌నగర్‌లో చలివేంద్రాలు, అంబలి కేంద్రాల నిర్వహణ
- వేసవిలో ఉపశమనం పొందుతున్న బాటసారులు, స్థానికులు



షాద్‌నగర్‌లో మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

షాద్‌నగర్: సమాజ సేవలో మేము సైతం అంటూ ముందుకుసాగుతున్నారు పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు. ఏటా వేసవిలో చలివేంద్రాలు, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దప్పిక తీరుస్తున్నారు. షాద్‌నగర్‌కు చెందిన వాసవి చిట్ ఫండ్ అధినేత, విశ్వహిందు పరిషత్ రాష్ట్ర కోశాధికారి బండారి రమేశ్ తన తల్లిదండ్రులైన దివంగత లక్ష్మమ్మ, రాజయ్యల జ్ఞాపకార్థం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట 20 ఏళ్లుగా చలివేంద్రం ఏర్పాటు చేసి, బాటసారులు, స్థానికులు, ప్రయాణికులకు తాగునీరు పంపిణీ చేస్తున్నారు. పదేళ్లుగా అంబలి సైతం అందజేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం షాద్‌నగర్ వచ్చే ప్రజలు ఇక్కడ మంచినీళ్లు, అంబలి తాగి ఉపశమనం పొందుతున్నారు. అలాగే న్యూసిటీ కాలనీకి చెందిన శ్రీనివాస్‌చారి పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న పోచమ్మ దేవాలయం ఎదురుగా చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గత మూడేళ్లుగా నిత్యం వందలాది మందికి మంచి నీళ్లు, మజ్జిగ అందజేస్తున్నారు.

సేవ దేవుడిచ్చిన వరం



ప్రజలకు సేవ చేయడం దేవుడిచ్చిన వరం. వివిధ పనులపై పట్టణానికి వచ్చే వారు వేసవిలో తాగునీటి కోసం ఇబ్బంది పడుతుంటారు. పదేళ్ల క్రితం ఈ సమస్య చాలా జఠిలంగా ఉండేది. పేదలకు గుక్కెడు నీళ్ల ఇవ్వాలని భావించి, 20ఏళ్ల క్రితం చలివేంద్రం ప్రారంభించా. పదేళ్లుగా అంబలి సైతం పంపిణీ చేస్తున్నాం.

– బండారు రమేశ్, వ్యాపారవేత్త, షాద్‌నగర్

సేవే లక్ష్యం



వేసవి కాలంలో చాలా మంది మంచి నీటి కోసం ఇబ్బందులు పడుతుంటారు. ఇలాంటి వారి కోసమే మూడేళ్లుగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా.

– శ్రీనివాస్‌చారి, న్యూసిటీ కాలనీ, షాద్‌నగర్

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య



అంజయ్య (ఫైల్)

కేశంపేట: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన నాగిళ్ల అంజయ్య(50) వ్యవసాయం చేసుకుంటూ భార్యతో కలిసి ఉండేవాడు. ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అటునుంచి మెరుగైన చికిత్స కోసం ఉస్మానియాకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య అంజమ్మ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరహరి తెలిపారు. కాగా అంజయ్య మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలను వెలిబుచ్చారు. విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.